

అరుతడితో అధిక లాభాలు

సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు అన్నారు. 8లో▸



విస్తరణ చేపట్టాలి

హైదరాబాద్ –బీజాపూర్ రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలని కోరుతూ మల్లారెడ్డి అనే వ్యక్తి రిలే దీక్షకు దిగాడు. 8లో▸



విద్యుత్ సమస్యలు రానివ్వం

రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టినట్టు షాద్‌నగర్ ట్రాన్స్‌కో డీఈ చెప్పారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యయులకు సర్వీస్ రూల్స్, ఇన్‌కం టాక్స్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా తమ విధులు, బాధ్యతలను గుర్తించుకోవాలని తెలిపారు. ఉద్యోగానికి సంబంధించి సర్వీస్ రూల్స్, ఇన్‌కంటాక్స్‌పై అందరికీ సరైన అవగాహన ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందని చెప్పారు. ఉపాధ్యాయులపై ఉండే ఒత్తిడిని ఎలా నివారించుకోవాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై డాక్టర్ శ్రీధర్ దిశా నిర్దేశం చేశారు. ఇన్‌కం ట్యాక్స్ రూల్స్‌పై ఐటీ ఎక్స్‌పర్ట్ రవికుమార్ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ అంశాలపై రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు వివరించారు. సమావేశంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కానాపూర్ హెచ్చం వెంకటయ్య, జయసింహారెడ్డి, ఎంఈఓలు పురన్‌దాస్, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలకు చెందిన గెజిటెడ్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పంచాయతీ పోయె.. మున్సిపాలిటీ వచ్చే



చేవెళ్ల: ఎనిమిది పంచాయతీలతో కలిపి చేవెళ్ల కొత్త మున్సిపాలిటీగా ఏర్పడింది. సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కృష్ణమోహన్ రెడ్డి, ప్రత్యేకాధికారిగా పి.శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీలకు సంబంధించిన రికార్డులన్నింటినీ పంచాయతీగా క్లోజ్ చేయాలని ఆదేశించారు. మంగళవారం చేవెళ్ల పంచాయతీ కార్యాలయం పేరును మార్చి చేవెళ్ల పురపాలక సంఘంగా మార్పు చేశారు.

ముగిసిన శ్రీరుద్ర సహిత శత చండీయాగం



యాగంలో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

కందుకూరు: దాసర్లపల్లి పరిధిలోని శ్రీమాత క్షేత్రంలో చండీ ఉపాసకుడు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీరుద్ర సహిత శత చండీ యాగం మూడో రోజు మంగళవారం కొనసాగింది. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య 108 యజ్ఞ గుండాలతో యాగం నిర్వహించి మహా పూర్ణాహుతి చేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, జైపాల్ యాదవ్, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జి.రాజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ మంద జ్యోతి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవయవదానం చేసిన కుటుంబానికి సన్మానం

షాద్‌నగర్: అవయవ దానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం ప్రభుత్వ జీవన్‌దాన్ సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన బైరమోని వెంకటేశ్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. మృతుడి అవయవాలను జీవన్‌దాన్ సంస్థకు కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మృతుడి భార్య పార్వతమ్మ, కుమారులు సతీష్, హరీశ్, రాజేశ్‌ను జీవన్‌దాన్ సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు కొందూటి నరేందర్, విశ్వం, మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు చీపిరి రవి యాదవ్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, అంతయ్య పాల్గొన్నారు.

పుడ్డూ గుడ్డూ అంతంతే

ఉడికీఉడకని అన్నం.. నీళ్ల చారు

- మెనూ ప్రకారం అందని భోజనం
- రుచిపచీ లేకుండా వడ్డింపు
- ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న చాలామంది విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో తప్పని తిప్పలు

సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాలతో కూడిన భోజనం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడం.. వంట ఏజెన్సీలకు ధరలు గిట్టుబాటు కాకపోవడంతో పథకం కాస్తా 'నీరు'గారి పోతోంది. మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేసింది. ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల చారు.. మెనూ ప్రకారం కాకుండా ఇష్టం వచ్చిన కూరలు వండడం దర్శనమిచ్చాయి. పలువురు విద్యార్థులను కదిలించగా రుచీపచీలేని భోజనం చేయలేకపోతున్నామని వాపోయారు. 'పుడ్డు సరిగా లేదు.. గుడ్డు సరిగా అందడం లేదు' అని చెప్పుకొచ్చారు. తినలేక చాలామంది పిల్లలు ఇళ్ల నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని తినడం కనిపించింది.

- వివరాలు 9లో▸



వీరంతా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో వడ్డించే మధ్యాహ్న భోజనం బాగుండడం లేదని.. తినలేకపోతున్నామని వాపోయారు. 'సాక్షి' విజిట్‌లో అంతా ఇలా ఇళ్ల నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని తినడం కనిపించింది. - మొయినాబాద్‌రూరల్

'రుచి'ంచడం లేదు



పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినాలనిపించడం లేదు. నాణ్యత సరిగా లేదు నోటికి 'రుచి'ంచడం లేదు. నా వంటికి పడటంలేదు. అందుకే ఇక్కడ తినడం లేదు. ఇంటి నుంచి టిఫిన్ బాక్స్ తెచ్చుకుని తోటి విద్యార్థులతో కలిసి తింటున్నాను.

– తరుణ్‌రాజ్, 10వ తరగతి విద్యార్థి, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మె'నో'.. పెట్టిందే తిను



కొత్తూరు పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో భాగంగా సిద్ధం చేసిన పాలకూర పప్పు ఇది. మెనూ ప్రకారం మంగళవారం అన్నంతో పాటు సాంబార్, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రీ ఇవ్వాల్సి ఉండగా ఇలా పాలకూర పప్పుతో సరిపెట్టారు. – కొత్తూరు

ముద్దగా వద్దు



ఆమనగల్లు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం వండిన అన్నం ఇది. బియ్యం సరిగా లేకపోవడంతో ఇలా ముద్దగా తయారైంది. రోజూ ఇలాంటి భోజనం చేయలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల బిల్లులు బకాయిలు ఉన్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. – ఆమనగల్లు

'చుక్'చకా..

షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

- అమృత్ భారత్ పథకం కింద ఎంపిక
- రూ.9.59 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- స్టేషన్‌లో చురుగ్గా సాగుతున్న పనులు



షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆవరణలో నిర్మిస్తున్న ముఖద్వారం

షాద్‌నగర్: రైల్వే దశను మార్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ల రూపురేఖలు మార్చేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో 15 రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. అందులో షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఒకటి. దీని అభివృద్ధికి రూ.9.59 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అత్యాధునిక సదుపాయాలు

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. స్టేషన్ ముందు ఉన్న స్థలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్‌లో వీఐపీ లాంచ్, లిఫ్టులు, టైల్స్, షెడ్స్, మరుగుదొడ్లు, మహిళలకు ప్రత్యేక గెస్టు హౌస్, పార్కింగ్ గార్డెన్‌లను నిర్మిస్తున్నారు. స్టేషన్ ఆవరణలో అత్యాధునిక అనౌన్స్‌మెంట్ సిస్టం, విద్యుత్ బోర్డులు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే పెయింటింగ్స్, ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ, అత్యాధునిక ముఖ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు.

వడివడిగా పనులు

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఏడాది క్రితం ప్రధాని మోదీ అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ప్రస్తుతం స్టేషన్ ఆవరణలోని స్థలాన్ని సుందరంగా మార్చుతున్నారు. ఆర్చ్, పార్కింగ్ గార్డెన్ పనులు చకచకా సాగుతున్నాయి. అదేవిధంగా భారీ ఐరన్ చానల్స్‌తో నిర్మాణ పనులు కొనసాగుతన్నాయి.

హర్షణీయం



షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఎంపిక కావడం, ఆధునీకరించడం అభినందనీయం. స్టేషన్‌లో సదుపాయాల కోసం ప్రయాణికులు ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. కేంద్రం నిధులు విడుదల చేసి చురుగ్గా పనులు చేపట్టడం హర్షణీయం.

– శివకుమార్, షాద్‌నగర్

దశ మారిపోతుంది



రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం అమృత్ భారత్ పథకాన్ని చేపట్టింది. దీంతో రైల్వే స్టేషన్ దశ పూర్తిగా మారుతుంది. అన్ని హంగులతో ప్రయాణికులకు కావాల్సిన వసతులు కల్పనతోపాటు మరింత అభివృద్ధి జరుగుతుంది.

– దిద్దీ గోపాల్‌నారాయణ్, డీఆర్‌యుసీసీ సభ్యుడు



కొనసాగుతున్న పార్కింగ్ నిర్మాణ పనులు

'వర్గీకరణ'ను అడ్డుకునే కుట్రలు

మాలల ఒత్తిడికి తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి

- అమలు చేస్తామని హామీ ఇచ్చి జాప్యం చేస్తున్నారు
- ఫిబ్రవరి 7న 'వేల గొంతులు– లక్షల డప్పుల' ప్రదర్శనకు తరలిరండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

మహేశ్వరం: కాంగ్రెస్‌లో ఉన్న మాలల ఒత్తిడికి తలొగ్గే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రాం చౌరస్తాలో మంగళవారం 'వేల గొంతులు– లక్ష డప్పుల' జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలు, మాదిగ ఉప కులాలు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైందని అన్నారు. 30 ఏళ్ల అలుపెరుగని పోరాటంతో సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీలో ఉన్న 59 కులాల్లో వర్గీకరణ కావాలని 58 కులాలు మద్దతు ఇస్తుంటే, ఒక్క మాల కులం మాత్రం అడ్డుకునే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి, ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని, మాలల ఒత్తిడికి తలొగ్గి ఇప్పటి వరకు అమలు చేయకుండా ద్రోహం చేస్తున్నారని మండపడ్డారు. దేశంలో పంజాబ్, హర్యానా, తమిళనాడుతో వర్గీకరణ అమలు చేస్తున్నారని, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో అమలు చేస్తామని సీఎం చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మాదిగల గొంతు, డప్పు చప్పుళ్లను ప్రపంచానికి వినిపించేందుకు వచ్చేనెల 7న హైదరాబాద్‌లో 'వేల గొంతులు– లక్షల డప్పుల' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఒక డప్పు భుజాన వేసుకొని రావాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు బీరప్ప గుడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ప్రజా ప్రతినిధులు మంద కృష్ణ మాదిగను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాయకులు మిట్టపల్లి సురేందర్, దరువు ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, మాదిగ మాజీ ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పథకాల అమలులో ఉద్యోగులు కీలకం



డైరీని ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీని టీజీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరవేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి ఉద్యోగులు వారధిగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్‌ఏ, హెచ్‌ఆర్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీజీఓఎస్ అధ్యక్షుడు డాక్టర్ రామారావు, సెంట్రల్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ శ్యాం, నరహరి, గంప శ్రీనివాస్, పరమేశ్వర్‌రెడ్డి, శిరీష, సూజాత, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్‌లైన్స్

హయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన యూజీసీ గైడ్‌లైన్స్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, వెంటనే వీటిని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రావి నారాయణరెడ్డి కాలనీలో మంగళవారం జరిగిన కౌన్సిల్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన గైడ్‌లైన్స్‌తో రాష్ట్రాల్లో యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయే ప్రమాదం ఉందని, వీసీల నియామకాల్లో రాజకీయ ప్రమేయం, డబ్బు ప్రభావం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్టు ఏఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి చింత వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కార్తీక్‌రెడ్డి, శ్రావణి, సంకి పార్వతి, అరవింద్, చందు, రాఘవ పాల్గొన్నారు.

ఎర్ర జెండా అంటేనే భరోసా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

చేవెళ్ల: ఎర్ర జెండాను చూస్తే నిరుపేదలు గుండెకు హత్తుకుంటారని, భూస్వాములు, దోపిడీదారులు భయపడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం నియోజకవర్గ కార్యదర్శి కె.రామస్వామి అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. దేశ గడ్డపై 99 ఏళ్లు పూర్తి చేసుకొని శత వసంతంలోకి అడుగుపెడుతున్న ఏకైక పార్టీ జెండా సీపీఐ అని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారం లేకపోయినా, పదవులు లేకపోయిన, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప సిద్ధాంతం కమ్యూనిజం అని తెలిపారు. దోపిడీ కోటలను కూల్చి పేదల రాజ్యాన్ని నిర్మించిన చరిత్ర ఈ పార్టీకి ఉందన్నారు. భూమికోసం భుక్తికోసం పేదల విముక్తికోసం నిజాం రాజుకు వ్యతిరేకంగా, బ్రిటిష్ సామ్రాజ్యావాదులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిందని, ఏనాడు ప్రభుత్వాలకు రాజీ పడలేదన్నారు. గత ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోలేదని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైనా చొరవ చూపించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పి.పర్వతాలు, ఎం.యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, ఎస్.శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, మండలాల కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

గురుకులంలో ఫుడ్ పాయిజన్

- 84 మంది విద్యార్థులకు అస్వస్థత
- ఆలస్యంగా వెలుగులోకి..
- విద్యార్థులు క్షేమంగా ఉన్నారన్న ప్రిన్సిపాల్



నాదర్‌గుల్‌లోని గురుకుల బాలుర పాఠశాల

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విషయంల ఆలస్యంగా వెలుగు చూసింది. కందుకూరు మండల గురుకుల హాస్టల్‌ను నాదర్‌గుల్‌ని నోబుల్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఈనెల 26న విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. 11 గంటల సమయంలో గురుకులంలోనే తయారు చేయించిన లడ్డూలు, మిఠాయిలు, కార అందించారు. మధ్యాహ్నం భోజనం వడ్డించారు. అదే రోజు సెలవు కావడంతో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్ల నుంచి తెచ్చిన భోజనం విద్యార్థులకు తినిపించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. సుమారు 84 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కనీయకుండా నిర్వాహకులు జాగ్రత్త పడ్డారు. ఒకరిద్దరు విద్యార్థులకు సీరియస్‌గా ఉండడంతో తల్లిదండ్రులకు ఫోన్లు చేసి రప్పించి ఇళ్లకు పంపించినట్టు సమాచారం. మిగిలిన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స చేసి మందులు అందించడంతో కోలుకున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ దేవానంద్‌ను వివరణ కోరగా విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం వాస్తవమేనని అన్నారు. వెంటనే చికిత్స అందించామని, అందరూ కోలుకుని తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆదిబట్ల పోలీసులు ఆరా తీస్తున్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.71 వేల నగదు, తొమ్మిది మొబైల్‌ ఫోన్లు స్వాధీనం

యాచారం: తొమ్మిది మంది పేకాటరాయుళ్లను మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కిషన్‌పల్లి గ్రామ శివారు ఓ వెంచర్‌లో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.71 వేల నగదు, తొమ్మిది మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేసవిలో విద్యుత్‌ సమస్యలు రాకుండా చర్యలు

షాద్‌నగర్‌ డీఈ శ్యాంసుందర్‌ రెడ్డి

నందిగామ: రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ఎలాంటి విద్యుత్‌ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు షాద్‌నగర్‌ ట్రాన్స్‌కో డీఈ శ్యాంసుందర్‌ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పారిశ్రామికవాడ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడైనా విద్యుత్‌ తీగలు కిందకు వేలాడినట్లు ఉన్నట్లయితే సరిచేయడమే కాకుండా అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వేసవిలో విద్యుత్‌ వినియోగం పెరగనుందని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. డివిజన్‌లోని 7 సెక్షార్లలో విద్యుత్‌ సమస్యలు తలెత్తకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామికవాడ అయిన కొత్తూరు, నందిగామ మండలాల్లో విద్యుత్‌ వినియోగం ఎక్కువగా ఉంటుందని, బిల్లులు సైతం అత్యధికంగానే ఉంటాయని పేర్కొన్నారు. షాద్‌నగర్‌ డివిజన్‌లోని ఏడు సెక్షార్లలో చాలాచోట్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ రవీందర్‌, కొత్తూరు ఏఈ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న డీఈ శ్యాంసుందర్‌ రెడ్డి తదితరులు

'హైదరాబాద్‌- బీజాపూర్‌' విస్తరణ చేపట్టాలి

రిలే దీక్షకు దిగిన మల్లారెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్‌ –బీజాపూర్‌రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలని కోరుతూ మల్లారెడ్డి అనే వ్యక్తి రిలే దీక్షకు దిగాడు. చేవెళ్లలోని షాబాద్‌ చౌరస్తా సమీపంలో మంగళవారం దీక్షకు కూర్చున్నాడు. షాబాద్‌ మండలం పోతుగల్‌ గ్రామానికి చెందిన మల్లారెడ్డి సామాజిక అంశాలపై తరచూ స్పందిస్తుంటాడు. ఈ రోడ్డు విషయంలో పలుమార్లు అధికారులతో మాట్లాడి పోలీసుల నుంచి అనుమతి తీసుకొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రిలే దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ జరగకపోవడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పోలీస్‌ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మీర నాలుగులేన్ల రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలన్నారు. చేవెళ్ల ప్రాంతానికి చెందిన అఖిలపక్షం నాయకులంతా కలిసి రావాలని సూచించారు. రోడ్డు విస్తరణ జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని స్టం చేశారు. విషయం సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడంతో మల్లారెడ్డిని పలువురు అభినందించారు.


దీక్ష చేస్తున్న మల్లారెడ్డి

తండాల్లో ఎక్సైజ్‌ దాడులు

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిధిలోని జర్పులతండా, జగ్గుతండాలో మంగళవారం దాడులు నిర్వహించి 5 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ భద్యనాథ్‌చౌహాన్‌ తెలిపారు. రెండు తండాల్లో 25 కిలోల బెల్లం, 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌, సిబ్బంది శంకర్‌, దశరథ్‌, బాబు, సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌ పోలీసులు

రైతులకు చేరువగా 'హెచ్‌డీసీసీబీ'

- ఆదిబట్ల ఠాణా ఎదుట ఎకరా స్థలం కేటాయింపు
- కొనసాగుతున్న భూమి చదును పనులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: హైదరాబాద్‌ డిస్ట్రిక్‌ కోఆపరేటివ్‌ సెంట్రల్‌ బ్యాంకు ఆదిబట్లకు రానుంది. ఇప్పటి వరకు నాంపల్లిలో ఉండి రైతులకు సేవలందిస్తున్న ఈ బ్యాంకు ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌ జిల్లాలోని సహకార సంఘాలకు చేరువ కానుంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ కొంగరకలాన్‌కు రావడంతో జిల్లా ప్రజలకు ఉపశమనం లభించింది. రంగారెడ్డి, వికారాబాద్‌, మేడ్చల్‌, హైదరాబాద్‌ జిల్లాల్లోని సహకార సంఘాలకు హెడ్‌గా ఉన్నటువంటి హైదరాబాద్‌ డిస్ట్రిక్ట్‌ కోపరేటివ్‌ సెంట్రల్‌ బ్యాంకు ప్రస్తుతం అబిడ్స్‌ రోడ్డు నాంపల్లిలో కొనసాగుతోంది. 50 సహకార సంఘాలలో లక్షన్నర పైగా రైతులు ఉన్నటువంటి ఈ బ్యాంకు నుంచి కోట్లాది రూపాయలు రైతులకు దీర్ఘకాలిక రుణాలు, వ్యక్తిగత రుణాలు, పంట రుణాలు అందజేస్తున్నారు. నగరంలో ఉండటంతో పరిపాలన సౌలభ్యం ఒకింత ఇబ్బందిగా ఉండేది.

ఎకరా స్థలం కేటాయింపు

హెచ్‌డీసీసీబీ బ్యాంకు నిర్మాణం కోసం పాలకవర్గం ఆదిబట్లను ఎంచుకుంది. ఆదిబట్ల ఠాణా ఎదుట సర్వే నెంబరు 79లో ఎకరా స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సెంట్రల్‌ బ్యాంకు అధికారులు, డీసీసీబీ చైర్మన్‌ కొత్తకుమర్మ సత్తయ్య కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్‌ నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఎకరా స్థలం కేటాయించారు. దీంతో రెండు రోజులుగా భూమిని చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు.


హెచ్‌డీసీసీబీ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కొనసాగుతున్న పనులు

అందరికీ అందుబాటులో..



హెచ్‌డీసీసీబీ నగరంలో ఉండడంతో ట్రాఫిక్‌ అవస్థలు తప్పడం లేదు. సొంత భవనం ఉన్నప్పటికీ ఇబ్బందులు పడుతున్నాం. నగర శివారులో ఉంటే ట్రాఫిక్‌ ఉండదు. అందరికి అందుబాటులో ఉంటుంది. ఆదిబట్ల ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. హైటెక్‌ నగరంగా ఇన్న దగ్గర బ్యాంకు ఏర్పాటు చేస్తే లాభాలు సైతం బాగుంటాయి. లావాదేవీలకు సులభంగా ఉంటుంది. భూమి కేటాయించినందుకు కలెక్టర్‌కు, ఎమ్మెల్యే రంగారెడ్డికి రైతుల తరుపున ధన్యవాదాలు.

– సత్తయ్య, చైర్మన్‌, డీసీసీబీ

ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో తిరుపతన్నకు బెయిల్‌

సిటీ కోర్టులు: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో పలువురు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ–4గా ఉన్న తిరుపతన్నకు నాంపల్లి కోర్టు, హైకోర్టులో బెయిల్‌ లభించకపోవడంతో సుప్రీం కోర్టు సోమవారం బెయిల్‌ మంజూరు చేసింది. రూ.లక్షతో రెండు పూచీకత్తులను సంబంధిత కోర్టులో దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం తిరుపతన్న తరుపు న్యాయవాదులు రెండు పూచీకత్తులను నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్‌ మెట్రోపాలిటన్‌ మెజిస్ట్రేట్‌ కోర్టులో అందజేశారు. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయన విడుదలయ్యారు. ప్రతి విచారణకు ఆయన కోర్టుకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు పేర్కొంది.

ఆరుతడితో అధిక లాభాలు

- అపరాల సాగుతో భూసారం వృద్ధి
- జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

కేశంపేట: పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు అన్నారు. మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌ అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. అపరాల పంటలైన పెసర, మినుము పంటలను సాగు చేయాలని తెలిపారు. ఆరుతడి పంటల్లో అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు వస్తాయన్నారు. వీటిద్వారా భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు. సాగు కాలం తక్కువగా ఉండటంతో ఎక్కువ సార్లు సాగు చేయవచ్చని వివరించారు. నాబ్‌కో సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ సంఘటిత నిధి ద్వారా నాబార్డ్‌ వంటి సంస్థలు వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ తదితర యూనిట్లకు రుణాలు అందిజేస్తోందని తెలిపారు. ప్రతీ మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో పాల్గొనే అధికారులు, శాస్త్రవేత్తలు సీజన్‌కు తగిన విధంగా రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్‌ ఏడీఏ రాజారత్నం, కేశంపేట ఏఓ శిరీష, ఏఈఓలు వినయ్‌, నిఖిల్‌, ప్రశాంత్‌, సుధ, రాజేశ్వరితో తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

అక్షిత.. 'ట్రిపుల్‌ గోల్డ్‌'

- జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యాచారం విద్యార్థిని
- స్టేట్‌ లెవెల్‌ పారా అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అక్షిత జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికైంది. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం నిర్వహించిన సెవన్త్‌ స్టేట్‌ లెవల్‌ పారా అథ్లెటిక్స్‌ 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌ జంప్‌ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు చెన్నైలో నిర్వహించే జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ద్రోణా చార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్‌, అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి, పారా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ ప్రశాంత్‌ తదితరులు స్టేడియంలో అక్షితను అభినందించారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సీఐ నర్సింహరావు, పాఠశాల హెచ్‌ఎం నర్సింహ, పీడీ మల్లేశ్‌ తదితరులు అక్షిత ఎంపికపై హర్షం వ్యక్తంచేశారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అక్షిత (ఫొటోలో ఎడమ నుంచి మొదటి బాలిక)

చిరుత కాదు.. అడవి పిల్లి

- జక్కేపల్లిలో చిరుత సంచరించిందని ప్రచారం
- పాదముద్రల ద్వారా జంగపిల్లిగా నిర్ధారించిన అటవీ అధికారులు


అడవిపిల్లి కళేబరం


జక్కేపల్లి శివారులో లభ్యమైన అడవిపిల్లి పాదముద్రలు

యాలాల: మండలంలోని జక్కేపల్లి శివారులో చిరుతపులి సంచరించిందంటూ జరిగిన ప్రచారం కలకలం రేగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అమృతప్ప మంగళవారం ఎప్పటిలాగే ఊరి శివారులోని తన పొలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిరుతపులిని పోలిన ఓ జంతువు, దాని వెంట రెండు పిల్లలను చూసి భయపడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులతో పాటు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జంతువు సంచరించిన ప్రాంతంలో లభ్యమైన పాదముద్రలను సేకరించారు. వీటి ఆధారంగా అది చిరుతపులి కాదని, అడవి పిల్లి(జంగపిల్లి) అని ఫారెస్టు సెక్షన్‌ అధికారి శంకర్‌ ధ్రువీకరించారు. వీటితో పాటు పొలాల సమీపంలో జంగపిల్లి కళేబరాన్ని గుర్తించారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

'సాఫ్ట్‌'గా దోచేశారు!

- సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎర
- నలుగురిని అరెస్టు చేసిన నార్త్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్‌ నుంచి సంగ్రహించిన డేటా... సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాల పేరుతో ఎర... ఫోన్‌ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహణ...యాప్‌ ద్వారా అపాయింట్‌మెంట్‌ ఆర్డర్లు తయారీ... నకిలీ మెయిల్‌ ఐడీల ద్వారా వీటి బట్వాడా...వెరసి అందినకాడికి దండుకుని టోకరా... ఈ పంథాలో రెచ్చిపోయిన ఘరానా ముఠాకు ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు చెక్‌ చెప్పారు. ఇలా 13 మంది నిరుద్యోగుల నుంచి రూ.26.25 లక్షలు స్వాహా చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ వైవీఎస్‌ సుధీంద్ర మంగళవారం ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జి.పవన్‌ కుమార్‌, బి.రేవంత్‌, బి.రాజీవ్‌ రెడ్డి, ఎస్‌.సుధీర్‌ ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ద్వారా, అడ్డదారిలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు పొందాలని భావించే వారిని వీళ్లు టార్గెట్‌గా చేసుకున్నారు. ఉద్యోగార్థులు వివిధ జాబ్‌ పోర్టల్స్‌లో అప్‌లోడ్‌ చేసిన బయోడేటాలను సుధీర్‌ సంగ్రహించే వాడు. వీటిని డౌన్‌లోడ్‌ చేసుకుని పవన్‌కు పంపేవాడు. ఇతగాడు వాటిలో ఉన్న వివరాల ఆధారంగా ఆయా ఉద్యోగార్థులను సంప్రదించే వాడు. ప్రముఖ సాఫ్ట్‌వేర్‌ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికే వాడు. ఆఫర్‌ లెటర్‌ లేదా అపాయింట్‌మెంట్‌ ఆర్డర్‌ వచ్చిన తర్వాత నిర్ణీత మొత్తం చెల్లించాలని షరతు విధించే వాడు. దీనికి అంగీకరించిన ఉద్యోగార్థుల వివరాలను రేవంత్‌కు పంపేవాడు. సాఫ్ట్‌వేర్‌ కంపెనీ హెచ్‌ఆర్‌ మేనేజర్‌ అవతారం ఎత్తే ఇతగాడు ఉద్యోగార్థులకు ఫోన్‌ చేసి ఇంటర్వ్యూ చేసే వాడు. ఒక్కోసారి ఒక్కో కంపెనీ పేరు చెప్తూ... కొన్ని సాధారణ ప్రశ్నలు అడిగి, వాటిని సమాధానాలు ఇచ్చిన వారితో ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పేవాడు. వీరి వివరాలు పవన్‌ ద్వారా రాజీవ్‌రెడ్డికి అందించే వాడు. ఇతగాడు కొన్ని యాప్స్‌లో పవన్‌ నుంచి అందిన అభ్యర్థి పేరు, అతడు ఎంపికైన పోస్టు, కంపెనీ.. ఇలాంటి వివరాలను పొందుపరిచే వాడు. దీంతో సదరు అభ్యర్థికి ఆ కంపెనీ లోగో, పేరు, వివరాలతో ఆఫర్‌ లెటర్‌/అపాయింట్‌మెంట్‌ లెటర్‌ సిద్ధమయ్యేది. దీన్ని డౌన్‌లోడ్‌ చేసుకునే రాజీవ్‌రెడ్డి ఆయా కంపెనీల పేరు కలిగి ఉండే నకిలీ ఈ–మెయిల్‌ ఐడీలు సృష్టించేవాడు. ఇవి దాదాపుగా సదరు కంపెనీకి చెందిన అధికారిక మెయిల్‌ ఐడీల మాదిరిగానే ఉండేవి. దీని ద్వారా ఉద్యోగార్థులకు ఆఫర్‌/అపాయింట్‌మెంట్‌ లెటర్‌ పంపేవాడు. వీటిని అందుకున్న ఉద్యోగార్థులు తమకు ఆ ప్రముఖ కంపెనీలోనే ఉద్యోగం వచ్చినట్లు భావించే వారు. ఆపై మళ్లీ తెరపైకి వచ్చే పవన్‌ ఆ అభ్యర్థులకు ఫోన్‌ చేసి వివిధ చార్జీలు, డిపాజిట్ల పేరుతో డబ్బు డిమాండ్‌ చేసే వాడు. ఒక్కొక్కరి నుంచి గరిష్టంగా రూ.2 లక్షల చొప్పున మొత్తం 13 మంది నుంచి రూ.26.25 లక్షలు కాజేశారు. ఈ ముఠా వ్యవహారాలపై నార్త్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్‌ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాసులు దాసు, పి.గగన్‌దీప్‌, సి.రాఘవేంద్రరెడ్డి తమ బృందాలతో వల పన్నారు. నలుగురు నిందితుల్నీ పట్టుకుని వారి నుంచి రూ.5.67 లక్షలు నగదు, నకిలీ జాబ్‌ ఆఫర్‌ లెటర్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మారేడ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

గచ్చిబౌలి: విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. మంగళవారం రాత్రి టీఎన్‌జీవోస్‌ కాలనీలోని ఓ ఇంట్లో గచ్చిబౌలి పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఒక విటుడు, 9 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. టాంజానియా, కజికిస్తాన్‌కు చెందిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్‌తో ట్రబులే!

'టు వీలర్‌ ఫర్‌ టు ఓన్లీ'.. మోటారు వాహనచట్టం స్పష్టం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం నగరంలో షరామామూలుగా మారింది. ప్రధానంగా యువతే ఈ ఉల్లంఘనకు పాల్పడుతూ నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున డాక్టర్‌ మన్మోహన్‌సింగ్‌ ఫ్లైఓవర్‌పై ముగ్గురు మైనర్లు చనిపోవడానికి ప్రధాన కారణం ట్రిపుల్‌ రైడింగే. ఈ ఉల్లంఘనపై ట్రాఫిక్‌ విభాగం అధికారులు ఏటా వేల కేసులు నమోదవుతున్నా.. వాహనదారుల వ్యవహార శైలిలో ఏమాత్రం మార్పు రావట్లేదు. – సాక్షి, సిటీబ్యూరో

- ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణాలు
- ప్రమాద హేతువులుగా మారుతున్న పరిణామాలు
- అత్తాపూర్‌ ఘటనకు ప్రధాన కారణం ఇలాంటి ఉల్లంఘనే
- సాంకేతికంగానూ ఈ డ్రైవింగ్‌తో ఇబ్బందులు ఎన్నో



మృతులు, బాధితుల్లో ఎక్కువ శాతం యువతే..

ద్విచక్ర వాహనాలపై ఒకరి కంటే ఎక్కువ మంది ప్రయాణించే వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణంగా టు వీలర్స్‌ వినియోగించేది యూతే ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్న వారిలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. బంధువుల కంటే స్నేహితులతో కలిసే ఎక్కువగా ట్రిపుల్‌ రైడింగ్‌కు పాల్పడుతుంటారు. ఎక్కడైనా ట్రాఫిక్‌ పోలీసుల తనిఖీలు కనిపించినా.. జంక్షన్‌ వచ్చినా.. ఆఖరులో కూర్చున్న యువకుడు తక్షణం దిగిపోయి నడుస్తూ ముందుకు వెళ్లడం పరిపాటి. ఇలా చేస్తూ ట్రిపుల్‌ రైడర్లు అనేక సందర్భాల్లో పోలీసుల్నీ పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా దూసుకుపోతూ తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం అవివాహితులే కావడంతో కన్నవారికి పుట్టెడు దుఃఖం మిగులుస్తున్నారు.

వాహన అదుపు అసాధ్యం..

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టు వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్‌, వెనక పిలియన్‌ రైడర్‌ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి. అవి ఏంటంటే..

- **ఇంజిన్‌ కెపాసిటీ:** మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్‌ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎంతమంది ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో.. అదే సామర్థ్యంలో ఇంజిన్‌ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయాణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.

యాక్సిలరేటింగ్‌ కెపాసిటీ: ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్‌ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్‌ టేకింగ్‌ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్‌/బ్యాలెన్సింగ్‌ కెపాసిటీ: ఏదైనా వాహనం ప్రమాదానికి లోను కాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్‌ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్‌ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్‌ రైడింగ్‌ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీలపైనా పడి.. ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.